# మగవాడి దౌర్జన్యం

**మా** శివానందాన్ని ఎప్పుడూ ఒక విషయం బాధిస్తూ ఉండేది· హిందువులకు విడాకుల చట్టం ఎట్లా వస్తుందా, ఎప్పుడు వస్తుందా అనే విషయాలను గురించి కాదు మావాడి బాధ - విడాకుల చట్టం ఎట్లాగో అట్లా ఎప్పుడో అప్పుడు వచ్చి తీరుతుందనీ, దాన్ని తీసుకురాగల ధీరులూ, తీసుకురావలసిన అవసరమూ, దాన్ని వినియోగించుకోగల ఆత్మవికాసమూ హిందువులకు, ముఖ్యంగా ఆంధ్రులకు, జతపడినవనీ మావాడి దృఢనమ్మకం! అయితే వాడికి తెలిసినంత మట్టుకు ఈ విడాకుల చట్టమనేది ప్రపంచమందంతటా ఏదో రూపేణా దుర్వినియోగం అవుతున్నదని.

ఇంతకూ ఏ దేశంలోకూడా విడాకుల చట్టం ఆదర్శప్రాయంగా లేదు. మనం ఎవరిని అనుకరించాలి? (ఎవరినో ఒకర్ని అనుకరించక తప్పేది ఎటూ

లేదాయెను!) మనకు అన్నివిధాలా ఇంగ్లండును అనుకరించటం శ్రేయస్కరం కనక దాన్నే అనుకరిద్దామంటే, ఖరీదుకు ఖరీదు అట్లా ఉండగా ఇతరత్రా బోలెడన్ని చిక్కులున్నై, భార్యాభర్తలు కలిసి కాపరం చెయ్యటం లేదన్నా, మాట్లాడుకోటం లేదన్నా కూడా విడాకులివ్వరు. ఇంగ్లీషు దంపతులకు మగవాడు (లేక ఆడది) భార్య (లేక భర్త) కాని పరస్త్రీ (లేక పురుషుడి) తో సంబంధం కలిగి ఉంటున్నట్టు ప్రబల నిదర్శనాలు చూపబడినా; లేక భర్త (లేక భార్య) తాగివచ్చి భార్యను (లేక భర్తను) కొట్టినా - ఇదికూడా ఒకటి రెండు సార్లయితే పనికిరాదేమో! _ విడాకులివ్వబడతై, రుసుము చెల్లించిన మీదట. బాగానే ఉంది. ఈ నియమాలు మన దేశస్తులకు ఎట్లా పనికి వస్తవా అని మావాడిచింత.

ఆ ఇంగ్లండు దేశస్తులు ఇటువంటి చట్టంతో ఎట్లా నెగ్గుకొస్తున్నారో కాని, అటువంటి నియమాలు పెడితే ఒక్క సంసారం నిలుస్తుందా మన దేశంలో; మగముండాకొడుకైన తరవాత మడిగట్టుకుని ముక్కు మూసుకుని కూర్చోమంటే కూర్చుంటాడా అని మావాడి అనుమానం. ఎవడైనా అమాయకుడు ఎక్కడైనా పెళ్ళాన్ని కొట్టకుండా ఉంటాడేమో కాని, సామాన్యంగా ఆంధ్రుడికి తెల్లవారి పొద్దుగూకేలోపల ఒకటి రెండు సార్లయినా పెళ్ళానికి దేహశుద్ధి చెయ్యకుండా రోజు గడుస్తుందా?

మా శివానందంలో ఒకపెద్ద సుగుణం ఏమిటంటే, ఇటువంటి సమస్య ఒకటి వాడి బుర్రలో ప్రవేశించినప్పుడు దాన్ని గురించి దీక్షగా ఆలోచించేవాడు. తను ఒక పేరు బడ్డ సంఘసంస్కర్తకూడా నేమో, తనే ఇటువంటి విషయాలను గురించి అయోమయంగా ఉంటే తక్కిన తక్కువవాళ్ళకు వికాసం కలిగేదెట్లా? అందుచేత తను ఏదో నిర్ణయానికి రావటం యావదాంధ్రదేశానికీ కూడా చాలా ఎక్కువ సంగతి అని గ్రహించి, ఆ సమస్యను గురించి తను గట్టిగా ఆలోచించవలసిన బాధ్యత తనమీద _ ఆంధ్రులందరిచేతా తనమీద ఉంచబడినట్టు భావించుకుని మరీ ఆలోచించేవాడు.

అనేక పతివ్రతలచే పరిశుద్ధం చేయబడిన ఈ పుణ్యభూమిలో, దాదాపు ప్రతి కులాంగనా కూడా దమయంతీ, సీతా, సావిత్రీ, చంద్రమతీ మొదలైన పుణ్యస్త్రీల ఆదర్శాలనే "ఫాలో" అవుతూ భర్తనే దైవంగా నమ్మి పెళ్ళిఅయిన మరుక్షణంనుంచీ అనేక నోములూ అవీ చేస్తూ భర్తృచరణ సేవాతత్పరురాలై ఉన్నటువంటి ఈ భారతదేశంలో సంఘ సంస్కరణ యావత్తు మగవాడికే చెయ్యబడవలసి ఉందని శివానందం నమ్మకం.

కనుక రేపు ఆడది మగవాడికి విడాకులివ్వాలంటే ఇంగ్లండు విడాకుల

చట్టప్రకారం మగవాడు (1) ఇతరస్త్రీ చరించటం (2) భార్యను కొట్టటం అనేవి ఆధారాలు కావాలి. అవి ఇప్పుడు పరిపాటిగా ఉండటం చేతను, వాటిని ముందు నిర్మూలించి తరవాత విడాకుల చట్టం తీసుకురావలసి ఉంటుంది. అయితే మగవాడు ఇతరస్త్రీ చరించకుండా చస్తే ఉండడు. అది అంతటా ఉన్నదే. పైగా అది రహస్యంగా ఏడిచే ఏడుపు. దబ్బున రుజువు కావటమూ కష్టమే. పోతే మగముండా కొడుకులు అబలలమీద చెయ్యి చేసుకోవటమనేది ఉందే - దాన్ని నిర్మూలనం చేస్తేగాని తన జన్మసార్థకం కాదని మా శివానందానికి గట్టిగా తోచింది....

మా శివానందం ఈ విషయమై ఆలోచిస్తున్నాడనే తెలియదు నాకు. వాడు నాదగ్గిరికి వచ్చి ఒక భయంకరమైన ఉపన్యాసం ఇచ్చేదాకా.

మొదట్లో వాడేదో నాటకంలోనించి వప్పగిస్తున్నాడనుకున్నాను - అభినయింతో సహా. అంతకంతకూ వాడి కేకలు పెద్దవయినై. నాకు రకరకాల అపోహలు పోసాగినై.

ఉపన్యాసం ఇప్పట్లో ముగవదని తెలుసుకుని "ఏమిటిదంతా?" అని అడిగాను. మావాడు కొంచెం శాంతపడి, ఉద్రేకం తమాయించుకుని, తన బుర్రలో కొంతకాలంనించీ పరిభ్రమిస్తున్న విడాకుల సమస్య యావత్తూ నాకు చెప్పేశాడు.

"అయితే పెళ్ళాలని కొట్టకుండా మగవాళ్ళను ఎట్లా ఆపగలవు?" అని అడిగాను.

"అంతకన్న ఘోరం - అంతకన్న భయంకరం - దౌర్జన్యం - శోచనీయమైన విషయం _"

"అబ్బ అవునురా! ఈ శోచనీయమైన అలవాటు నిర్మూలించటానికి నువ్వే మార్గం ఆలోచించ బోతున్నావన్నాను."

"ముందు పబ్లిక్ ఒపినియన్ ఒకటి క్రియేట్ చెయ్యాలి. అక్కడక్కడా ఈ ఘోరాన్ని గురించి ఉపన్యసిస్తాను. సహగమనం తరవాత ఇటువంటి దురాచారం లేదని చిన్న ఆర్గ్యుమెంట్ ఒకటి తయారుచేశాను. చాలా ఇంపుగా ఉంటుంది, వింటావా?... నీయిష్టం! పోనీ తరవాతే విందుగాని!....ఏమిటో చెటుతున్నాను? ఆఁ! ప్రైవేట్ సంభాషణలో కూడా ఈ దురాచారాన్ని ఖండిస్తూ మాట్లాడతాను - క్లబ్బులోనూ అక్కడా! అన్నట్టు నువుకూడా ఒక సీరీస్ ఆఫ్ ఆర్టికల్స్ రాయరాదూ, ఈ దౌర్భాగ్యపు మొగ దౌర్జన్యాన్ని గురించి?" పొరపాటున "చూతాంలే!" అన్నాను.

"ఎబ్బే! ఆంధ్రుడికున్న మాయరోగమే ఇది. ఆంధ్రుడి రక్తంలో ఉద్రేకం ఏదీ? ఉద్రేకం అంటువ్యాధిలాగా పనిచెయ్యాలి, అప్పుడే ఏదైనా పని అవుతుంది. తియ్యి కలం కాగితాలూ!" అంటూ మావాడు నా పెట్టె సవరించి ఇప్పుడు నేను రాస్తున్న కాగితాల బొత్తితెచ్చి నాముందు పెట్టాడు; ఏదో మొదలుపెడితే కాని వదలడని ఈ కలంతోనే పైన "మొగవాడి దౌర్జన్యం" అని రాసి ఆలోచిస్తున్నట్టు నటించాను. మా శివానందం నిప్పులు తొక్కిన కోతి మాదిరిగా నాచుట్టూ నృత్యం చేస్తూ "ఊఁ! ఊఁ! అనటం మొదలుపెట్టాడు.

"నువ్వట్లా తొందరచేస్తే లాభంలేదు. ఉత్సాహం పుట్టందీ కలం సాగదు." అని వాడికి తెలియచెప్పాను.

"డామిట్! ఇతర దేశీయులంతా పైకి పాకుతుంటే ఆంధ్రుడు ఇన్స్పిరేషన్ కోసం—"

"ఏమ్రోయ్! స్నానాలు చెయ్యండి. నాకు దహించుకు పోతున్నది!" అని నాభార్య లోపలినించి కేక పెట్టింది....

అయితే మటుకేం? వాడు నాచేత రాయించదలుచుకున్న వ్యాసం ఇప్పుడు ఈ విధంగా వాడి కథగానే మారటం నామటుకు నాకు చాలా తృప్తికరంగా ఉంది. నాకు ఇన్స్పిరేషన్ వచ్చేలోపుగా వాడు చెయ్యవలసిన పని కాస్తా చేసి ఊరుకున్నాడు. తీరా నాకు వాడికథే రాయబుద్ధి అవుతున్నది.

మా శివానందం, ఎరుగుదురో లేదో, అనుకోటంలోనే కించిత్తు ఆలస్యం చేస్తాడేమో కాని, ఏదైనా కార్యం తలపెట్టాడంటే చెయ్యటానికి అనుకున్నంత సేపు పట్టదు. నన్ను వ్యాసపరంపర రాయమని చెప్పిన నాటి సాయంకాలమే క్లబ్బులో నలుగురినీ చేరదీసి, ఆడదాన్ని మొగవాడు కొట్టటం విషయమై ఇన్ఫార్మల్ లెక్చరు ఒకటి ఇచ్చాడు.

ఆ లెక్చరు అటే జయప్రదం కాలేదు. మా వెర్రి వెంగడాయ జోగారావు మధ్య మధ్య "అది కాదురా, సెర్చిలైట్!" అంటూ అడ్డంరావటమేకాక, ఆడదాన్ని మొగవాడు కొట్టటంకంటెకూడా వీధిబడి మాష్టర్లు పిల్లల్ని కొట్టటం ముందు విచారించదగిన సమస్య అని ఉపపాదించి, వెనక బడిపంతులు పనిచేసి రిటైరయిన పంతులు కామయ్య చేత సెకండు కూడా చేయించుకున్నాడు. ఆ తరవాత మీటింగు చాలా వేళాకోళంలోకి దిగిపోయింది. ఈలోగా మావాడి ఇన్స్పిరేషను కూడా దిగిపోయింది.

ఓడిపోవటమూ ఓటమి అంగీకరించటమూ ఒకటికాదని తెలిసినవాళ్ళు చెబుతున్నారు. మామూలు కుస్తీలలోనూ, పందేలలోనూ, ఏమీ లాభంలేదు.

అట్లా అనగల తాహతు పెద్దపెద్ద దేశాలకు మాత్రమే ఉన్నట్టు కనిపిస్తుంది. కాని మావాడు ఒక పెద్దదేశం మాదిరిగా ప్రవర్తించి, తన ప్రయత్నం విఫలం కాలేదని సగర్వంగా ఆ రాత్రి నాకు తెలియచేశాడు. అంతేకాదు నన్ను పదకొండు గంటలదాకా మేలుకోబెట్టి కొత్త "ప్లాన్ అఫ్ కాంపెన్" ఒకటి చర్చించాడు కూడానూ. నిజంగా పని కావాలంటే మొహమాటాలకు పోయి ఏమీ లాభం లేదుట. ముస్సోలినీ, స్టాలిన్, హిట్లర్ - వీళ్ళమో స్తరుగా ముందూ, వెనకా, కుడీ ఎడమా చూడకుండా బ్రహ్మాస్త్రాలు ప్రయోగించ వలసిందేనట. తనుకూడా ఈ సూపర్ మెన్ పాయలో చేరితేనే కాని తన ఉద్యమం కొనసాగ దని ఖచ్చితంగా తేల్చి చెప్పాడు. వాడి ప్రయత్నాన్ని భగవంతుడు జయ ప్రదం చేయుగాక అని బిగ్గరిగా కోరుకుని నేను పడుకుని నిద్రపోయినాను.

మర్నాడు మధ్యాన్నం నేనేదో చదువుకొంటుండగా మావాడు నా దగ్గిరికివచ్చి, "ఒరే; తట్టిందిరా! తట్టింది!" అంటూ వచ్చాడు.

నేను ఖంగారుపడి "ఎక్కడ?" అని అడిగాను.

"శ్రీరాములురా! శ్రీరాములు!" అన్నాడు వాడు ఉత్సాహంలో మాట్లాడ లేకుండా.

"అయితే?"

"శ్రీరాములు పెళ్ళాన్ని కొడతాట్ట! చేతులో ఏముంటే అది ఆవిడమీద, పాపం, గిరవాటేస్తాట్ట! ఒకసారి కట్టెపేడు తీసుకుని –"

"ఆయన భార్యాగారి సత్తా ఆయనకే తెలియాలి."

"ఏడిచినట్టుంది! ఎవరుమటుకు కట్టెపేడు పెట్టి కొడితే –"

"చెప్పవేం! ఆడది శక్తిస్వరూపిణి! ఎందుకు కొడతాట్ట శ్రీరాములు పెళ్ళాన్ని?"

"రామాయణమంతా విని! – సామెత చెప్పినట్టుంది! దౌర్జన్యం, పొగరు - మదం!....శ్రీరాములు, బ్రహ్మాస్త్రం ప్రయోగించేస్తాను. ఇంకెందుకూ?"

"ఏమిటీ నీ బ్రహ్మాస్త్రం?"

"ఇంకేముందీ? ఆయన్ను నలుగురిలోనూ పట్టుకుని ఝాడించెయ్యటమే!"

"ఒరే, పిచ్చి నీదుంపతెగా! శ్రీరాములుగారు అన్నివిధాలా నీకన్న వెయ్యిరెట్లు పెద్దమనిషి. ఎందులోనూ నువ్వాయన కాలిగోరుకు పోలవ్వు. అటువంటివాడు పెళ్ళాన్ని కొడుతున్నాడంటే నమ్మటమే! ఇష్టంలేదు నాకు.... అర్థంరాకు! – ఒకవేళ కొట్టాడే అనుకో, దానికి తగిన కారణం ఉంటుందన్ని నమ్మి వూరుకో! నువ్వూ నీ బ్రహ్మాస్త్రమూ! –"

"ఆ వెధవ మొహమాటాలే పనికి రావన్నాను. అట్లా అయితే నువ్వు ఒక్క క్షణం జర్మనీని పరిపాలించగలవా....అయన ప్రతిరోజూ పెళ్ళాన్ని కొడతాడని నేను గున్నయ్యగాడిచేత చెప్పిస్తాను, కావాలంటే. శ్రీరాములూ గున్నయ్యా పక్క పక్క భాగాల్లోనే కాపరం చేస్తున్నారు."

'తెలిసీ తెలియని నరుదెల్ల బ్రహ్మదేవుని వశమే?' అనుకుని నేను అంతటితో వాడితో వాదించటం చాలించుకున్నాను.

మొదటనే మనవి చేశాను, మావాడికి ఏదన్నా అనుకుంటే అది చెయ్యటానికి అరక్షణం పట్టదని, పైగా వాణ్ణి ఆపటం కూడా అసాధ్యం. ఇంకేం? ఆ సాయంకాలం క్లబ్బులో మాశివానందం వెధవ, శ్రీరాములుగారి పక్కనేచేరి ఆడవాళ్ళనుకొట్టే మొగవాళ్ళను కసిగా తిట్టడం మొదలుపెట్టాడు, అప్పుడప్పుడూ శ్రీరాములుగారి మొహం పరీక్షగాచూస్తూ. నేనూ అక్కడే ఉన్నాను. శ్రీరాములుగారి మొహం వెలవెల బారటం చూస్తున్నకొద్దీ మావాడి ఉత్సాహం హెచ్చింది. నాకు చెప్పరాని రోతా విచారమూ కలిగినై. మావాణ్ణి తక్షణమే హత్యచేసి నేనుకూడా చచ్చిపోదామనిపించేదాకా మావాడు వాగాడు. అంతకంతకూ వాడి వాగుడూ, ద్వంద్వార్థంగా మాట్లాడుతున్నాననుకునే వాడి ఆత్మసంతృప్తి దుర్భరంగాతోచి లేచిపోదామనుకుంటుండగా, నాకు శ్రీరాములు గారి మొహంలో మార్పు కనపడింది. ఆయన పెదవులమీద అస్పష్టమైన చిరునవ్వొకటి గమనించాను. ఇంకేముందీ? ఆయన మావాణ్ణి మింగేటందుకు ఏదో ఉపాయం ఆలోచించి ఉండాలి; ఆయన అమిత తెలివిగలవాడు. ఈ వెధవ ఆయన్ను ఏదో ఏడిపించబోవటమేమిటి? నేను అక్కడే ఉండి మావాడి దహన సంస్కారం కళ్ళారా చూతామని తీర్మానించుకున్నాను.

మావాడు ఊపిరి పుచ్చుకోవటానికి కాస్త ప్రవాహాన్ని ఆపగానే శ్రీరాములుగారు ఎంతో వినయవిధేయతలతో "ఆహా! శివానందంగారూ, ఇవాళ మీ నోటివెంట అమృతోపమానాలైన మాటలు విన్నానండీ! నాజన్మ తరించి పోయింది. ఇవాళ నన్ను మీరు కన్వర్టు చేసేశారు. నేను ఇంతకాలంనించీ ఎటువంటి పశుత్వంలో ఉంటున్నానో తెలిసి వచ్చింది!" అన్నాడు.

మావాడు చాలా గర్వపడ్డాడు తన ప్రజ్ఞకు; పైకి కపటం, ఆశ్చర్యం, నటిస్తూ, ఎగతాళిగా, "ఏమిటీ? ఎన్నడూ వినలేదే! శ్రీరాములుగారే పశుత్వంలో ఉండటం? నేను నమ్మను, నమ్మలేను!" అన్నాడు.

"మీరట్లా అనవద్దు. ఈ శ్రీరాముల్ని భార్యా సాన్నిధ్యంలో చూడాలి. మీరా మాటలంటుంటే నాకెంతో సిగ్గుగా ఉంది. నిజంగా ఇవాళ మీరు నన్ను ఇంకొక మనిషిని చేశారంటే నమ్మండి."

ఆయన వాలకం చూస్తే ఆయన్ను పశ్చాత్తాపం తనలో ముంచివేసుకున్నట్టు కనపడ్డది.

మా బేవ్‌కూఫ్ శ్రీరాములుగారు వేసిన పేచీలో పడిపోయి, తను ఎక్కణ్ణించో ఊడిపడ్డవాడల్లే నటిస్తూ "మీ పశ్చాత్తాపం నన్ను ద్రవింప చేస్తున్నది. స్నేహితుల మధ్యను కూడా మీరు ఎప్పుడయితే మీతప్పు ఒప్పుకున్నారో అప్పుడే భగవంతుడి దృష్టిలో మీకు దోష పరిహారం అయిపోయింది. ఇకను మానవదృష్టిలో మీ కళంకం పోవటానికి ఒక్కటే ఉపాయం - మీరు ఈక్షణంనించీ మీ భార్యాగారిని సాటిదాన్నిగా చూసి గౌరవించటమే. ఎక్కడ స్త్రీలు గౌరవింపబడుదురో ఏదీ సామెత!" అన్నాడు.

ఎంతో పెద్దనేరంచేసి ఎంతో గొప్పవాడిచేత క్షమించబడిన అతినీచుడి మోస్తరుగా శ్రీరాములుగారు చేతులు రుద్దుకుంటూ నవ్వుతూ "చిత్తం, చిత్తం! మీరప్పుడప్పుడూ మా యింటికి దయచేసి నా కాపరాన్ని ఒకకంట కనిపెట్టి ఉండాలి!" అన్నాడు.

ఇక మా వాజమ్మ సంతోషానికి మేరేలేదు.

"అయ్యో! ఎంతమాటా! రేపు ఉదయం కాఫీతాగి ఒక పర్యాయం మీయింటివైపు వస్తాం, నేనూ మావాడూ - మీ కభ్యంతరం లేకపోతే!" అన్నాడు మా శివానందం.

"ధన్యుణ్ణి అన్నమాట!" అన్నాడు శ్రీరాములుగారు.

ఆ రాత్రి మా బావమరిదిని బాగా తలవాచేట్టు చివాట్లు పెట్టటానికి ఉద్యమించాను. కాని వాడితో ఒక చిక్కుకాదు. "నన్నుచూసి ఓర్చుకలిగిందెప్పుడులే నువ్వు!" అని వాడు నానోరు మూసేశాడు, నేను అనదలచిన మాటల్లో ఒక్కపాలయినా అనకముందే.

నేను రానంటుంటే వినిపించుకోకుండా మర్నాడు దుర్ముహూర్తంలో నన్నుకూడా శ్రీరాములుగారింటికి ప్రయాణం చేశాడు మావాడు. ఏవిధంగానూ వాడివెంట వెళ్ళటం ఇష్టంలేకపోయినప్పటికీ, ఎవరన్నా వాణ్ణి తన్నటానికి వస్తే వాడిచేతులు రెండూ గట్టిగా పట్టుకోటానికైనా పక్కన ఉంటానుగదా అనే సదుద్దేశంతో నేను కూడా శ్రీరాములుగారింటికి బయలుదేరటానికి ఒప్పుకున్నాను.

ఇద్దరమూ శ్రీరాములుగారి గుమ్మంలో నిలబడి చెరొక కేకా పెట్టాం. ఎంత సేపటికీ జవాబు రాలేదు. మళ్ళీ చెరొక కేకా పెట్టాం. తలుపు అవతల ఎవరో మనుష్యులు మసులుతూ ఉండి కూడా మా కేకలు విననట్టు నటిస్తున్నారని నాకు

అనుమానం వేసింది. మావాణ్ణి మళ్ళీ ఒక దమ్ముపట్టమన్నాను. మావాడొక పెడబొబ్బ పెట్టాడు.

తలుపు వెనకనుంచి అస్పష్టంగా గొణుగుడు వినిపించింది "ఆఁ! శ్రీరాములుగారూ, చచ్చా!" అన్నట్టుగా ఉంది. అప్పుడే వచ్చిన దారి పడదామా అనే ఆలోచన నాకు తట్టింది. కాని ఇంతలో ఎవరో ముక్కుతూ మూలుగుతూ వచ్చి బరబరా గడియతీసి వాకిలి తెరిచారు. ఆ తలుపు తెరిచిన మనిషిని చూడగానే నన్ను ఎవరో మొహంమీద గట్టిగా కొట్టినట్టయింది.

ఆమెకు యాభై అయిదు సంవత్సరాల వయస్సుంటుందనుకున్నాను మొదట్లో, కాని మరుక్షణం తోచింది ఇంకా తక్కువ ఉండవచ్చునని, మనిషి అమిత భయంకరంగా ఉంది. ఉండే లేనట్టున్న కళ్ళూ, పైగా మెల్లా. పైవరస ఎదటి నాలుగుపళ్ళలోనూ ఒకపన్ను లేదు. నెత్తిమీద జుట్టుసహం నెరిసింది. తలఅంతా పర్రెలుపడి జుట్టు ఊడిపోయింది. వెనక్కు తిరిగితే కానీకంటె కొంచెం చిన్నదిగా చుట్టిఉన్న బిళ్ళచుట్ట కనిపించింది. ఆమె దవడలు చాలా లోతుగా ఉన్నై. చిన్నతనంలో ముక్కు లొట్టపడిపోయిన బిచ్చగాణ్ణి చూసేసరికి నాకు కంపరంపుట్టి చాలా సేపటి వరకూ పోలేదు. ఈమెను చూడగానే నాకు అటువంటి కంపరమే పుట్టింది. అనాకారితనమేకాదు, ఆమె మొహంలో కోపమూ, అసూయా, కుళ్ళుమోతుతనమూ ఇల్లుకట్టుకుని ఉన్నై.

నాకు మల్లే మావాడు చలించినట్టు కనిపించలేదు. ఎందుచేతంటే నేను తెప్పరిల్లుకోవటం మొదలుపెట్టక పూర్వమే వాడు ఆమెతో సంభాషణ ప్రారంభించేశాడు.

"ఏమండీ మీ అబ్బాయిగారింటో లేరా?" అన్నాడు మావాడు.

"అబ్బాయి – గారెవరు? – గారు! – ఎక్కడ చచ్చాడో!.... శివాయ్! ఒరే చచ్చినవాడా! పలకవేంరా, పాడెకట్టా! నీ కోసం ఎవడో వచ్చాడు!"

మమ్మల్ని, ఇద్దరు మనుష్యులను, చూస్తూ కూడా "ఎవడో వచ్చాడు" అనటం అవమానం చెయ్యటానికి కాకపోతే మరెందుకు? నాకు భగ్గున మండిపోయింది. ఇంతలో ఒక పదేళ్ళ కుర్రవాడు బయటికి వచ్చాడు, కీచుగొంతుతో "ఎందుకే, అమ్మా?" అనుకుంటూ.

"ఈ అబ్బాయి కాదండీ! మేం శ్రీరాములుగారి కోసం వచ్చాం!"

"మరి 'అబ్బాయిగా' రంటివేం? – గారు! – మొగుడు ముండాకొడుకే!" అంటూ ఆవిడ పోబోయింది. ఆవిడ ఆ మాట అనగానే మా కష్టాలన్నీ గట్టెక్కినట్టు.

"ఏమండీ శ్రీరాములుగారింతకూ ఇంటో ఉన్నట్టా లేనట్టా?" అన్నాడు మావాడు.

"ఉంటే పలకడూ? చెవిటివాడా?"

"అయితే మేము ఆయన వచ్చేవరకూ కనిపెట్టుకుని కూర్చుంటాం," అన్నాడు మావాడు మొండితనంగా, ఆమెవెంట లోపలికి పోతూ. నేను చేసేదిలేక లోపల ఏంచేస్తాడో వెధవ అని పిచపిచలాడుతూ వాడివెంట లోపలికి వెళ్ళాను.

ఆవిడ వెనక్కుతిరిగి "ఓహో! మీ ఇద్దరూ కూడా ఎందుకూ నా గొంతు మీదికి? ఇంటో మొగముండాకొడుకు లేకుండా చూసి ఇద్దరు వస్తాదులాంటి ముండాకొడుకులు నా వెంటపడితే వీధిలో చచ్చిన ముండాకొడుకులంతా నాకు రంకులు కట్టటానికా?" అని చకచకా బావివైపు వెళ్ళిపోయింది.

ఇద్దరమూ ఒకరి మొహాలు ఒకరం చూసుకున్నాం.

నేను శ్రీరాములుగారిని తలచుకుని చాలా జాలిపడ్డాను. ఆయనకు ముప్పైరెండు, ముప్పైమూడు సంవత్సరాలకు మించి వయస్సుండదు. మంచి స్ఫురద్రూపి, అమిత తెలివిగలవాడు. ఆయనకీ భార్యా ఏమిటి? – ఎవరో శపించినట్టు! దాంపత్యంలో కొంచెం ఎగుడు దిగుడులు ఎవరైనా ఒప్పుకుంటారు. ఇంత వైపరీత్యం ఎక్కడయినా ఉంటుందా? దరిద్రుడు తలంటుకోబోతే వడగళ్ళు పడ్డట్టు, మావాడు సంఘసంస్కరణకు ఉపక్రమించేటప్పటికి ఈ దంపతులు దొరకటం ఏమిటి?

"ఇప్పటికయినా చెంపలు వాయించుకుని, ఇంటికి పోదాం పద. ఏ క్షణం శ్రీరాములుగారు వస్తారో, ఆయన మొహం చూడటం ఎట్లాగా అని నా ప్రాణం చస్తున్నది!" అన్నాను.

శివానందం వెధవ ఒక్కక్షణం "సరే పద?" అనేట్టు కనపడి మళ్ళీ బిగదీసుకుపోయి, "ఛా! నీకు నా సంగతి అర్థం కానేలేదు. ఎటువంటి పెళ్ళాన్నయినా కొట్టటానికి అర్హతలేదు. శ్రీరాములుగారి భార్యా కొంచెం ఇదయిన మనిషే మరి. అయితేనేం? శ్రీరాములు నిన్న పశ్చాత్తాపపడటం నువ్వు కళ్ళారా చూశావా లేదా? కొంచెం ఈమెను కూడా రిఫారం చేశామంటే వాళ్ళిద్దరిదీ ఆదర్శప్రాయమైన దాంపత్యం కావచ్చును. నన్ను శ్రీరాములు స్వయంగా ఆహ్వానించాడు. నేను ఆయన వచ్చేదాకా ఇక్కడే ఉంటాను," అన్నాడు.

కుర్రవాణ్ణి చూడగానే మావాడు ఒక ఆలోచన తట్టినట్టుగా "అబ్బాయి, మాట! ఇట్లారా!" అని పిలిచి పక్కన కూర్చోమని వాడితో బాతాఖానీ ప్రారంభించాడు.

"మీ నాన్న మీ అమ్మను కొడతాడా?"

"చచ్చేట్టు కొడతాడు."

"మీ అమ్మ ఏం చేస్తుంది?"

"ఏడుస్తుంది. బావిదాకా పోయి, బావి బొడ్డుమీద కూర్చుని, కాస్సేపు వుండి మళ్ళీ తిరిగి వస్తుంది. రాగానే మానాన్న మళ్ళీ కొడతాడు."

"అదికాదు, మొదట మీ అమ్మ ఏంచేస్తే కొడతాడు మీ నాన్న?"

"మా అమ్మా? మా అమ్మ మా నాన్నను తిడుతుంది. కొట్టవస్తే మా నాన్నను పీకి కొరుకుతుంది. అప్పుడు మా నాన్న కొడతాడు."

"మీ అమ్మకు కొంచెం చిత్తచాంచల్యం ఉందా!"

ఆ కుర్రవాడు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పేలోపల దొడ్లోనించి "ఓరి చచ్చినవాడో!" అని పెడబొబ్బ ఒకటి వినపడ్డది. అది వినగానే కుర్రవాడు పరిగెత్తిపోయినాడు. కాస్సేపటికి బావిదగ్గిర సంభాషణ వినపడ్డది. ఆ తరవాత ఎవరినో ఎవరో తడీపెడీ చావగొట్టుతున్న చప్పుడు వినిపించింది. మరికొంచెం సేపట్లోనే శ్రీరాములుగారి భార్యారత్నం మామీద శక్తల్లే వచ్చి పడ్డది.

"ప్రతి తప్పుడు వెధవకూ నా జోక్యమే కావాలి! అందరూ పొట్టలకు అన్నం తినటంలా;.......!" అని ప్రారంభించింది. ఆ మాటలన్నీ నేను ఇక్కడ ఏకరువు పెట్టలేను. అందులో మొగవాళ్ళ చెవులు చిల్లులుపడే బండబూతులు కూడా వచ్చినై. ఆవిడ వాలకంచూస్తే కొడుకును చావదన్ని మేం వాడితో అన్న మాటలు అడిగి చెప్పించుకున్నట్టు కనపడ్డది. ఆవిడ గొంతు అంతకంతకూ పెద్దదవుతుంటే నాకు జన్మలో ఎన్నడూ కలగని భయం ఒకటి లోపలినించి పుట్టుకొచ్చింది. మనం దేనికి భయపడతామో దేనికి భయపడమో కూడా చెప్పలేంకద!

మావాడు నాకన్న మొండిఘటం. ఈ శివసముద్ర జలపాతం తెగిపోతుందనే ధైర్యంతో అయిదు నిమిషాలు చూసి అంతకంతకూ పెరగటమే కాని తరగటం లేకపోవటం చూసి ఆవిడకన్నా బిగ్గరగా అరవటం మొదలుపెట్టాడు. ఒక పావు విఘడియపాటు మావాడు గెలుస్తున్నట్టు కనపడ్డాడు. ఆ మీదట ఒక అరవిఘడియ ఇద్దరూ సమఉజ్జీలు అయినారు. విఘడియ పరిసమాప్తి అయ్యేటప్పటికి మావాడి నోరు కట్టుపడ్డది. కట్టుపడ్డదన్న సంతోషం ఏముంది? నేను ఆపే లోపల మా వెధవ ఆవిడమీద విరుచుకుపడి ఆవిడ రెండు దవడలూ ఫెడీ ఫెడీ వాయించ బోయినాడు. ఇంతలో —

"ఆడదాన్ని కొట్టటం సంఘానికి చాలా అపాయకరమైన విషయం అయినప్పటికీ, మీరు ఈ పరిస్థితుల్లో సరిఅయిన మోతాదే వాడబోతున్నారని నేను ఒప్పుకుతీరవలసి ఉంది!"

ఆ మాటలు వినపడగానే నాగుండె బద్దలయినంత పని జరిగింది. తేలు కుట్టినవాడల్లే నేను ఇంతెత్తు ఎగిరిపడి వెనక్కు తిరిగి చూశాను. మావెనక శ్రీరాములుగారు మందహాసం చేస్తూ నిలబడి ఉన్నాడు.

ఇద్దరమూ వెధవమొహాలు వేసుకుని నిలబడి ఉన్నాం నోటిమాటలు లేకుండా.

శ్రీరాములుగారే మళ్ళీ మాట్లాడటం మొదలుపెట్టాడు.

"నిన్న నేను చెప్పటం మరిచిపోయినాను నా భార్య నోటి దుడుకును గురించి. రాత్రి జ్ఞాపకం వచ్చింది. అయినా ఫరవాలేదు, శివానందంగారు రేపు వచ్చి నా హృదయాన్ని పవిత్రంచేసి నన్ను సంస్కరించినట్లే దాన్ని కూడా సంస్కరిస్తారుగదా అని నేను ధైర్యం చెప్పుకున్నాను....ఇట్లా కావటం నా ప్రారబ్ధం! మీరేం చెయ్యగలరు?" అన్నాడాయన మావాడిమొహం వాచేటట్టు.

నేను మాట్లాడక తప్పిందికాదు.

"అయ్యా శ్రీరాములుగారూ! మావాణ్ణి క్షమించవద్దు, నన్ను క్షమించినా! ఇటువంటిదేదో జరుగుతుందని నాకు అనుమానం కలిగే మావాడివెంట ఉంటున్నాను. కాని వాడికి నేను చాలను....సెలవిప్పించండి!"

"అసలే నేను చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉంటే నువ్వు నన్ను డౌన్ రైట్ గా ఆయన ఎదట నన్ను మరింత హేళన చేస్తావా?" అని మా శివానందం వెధవ నన్ను దారివెంట దెప్పటం మొదలుపెట్టాడు.

"ఒరే, ఇడియట్ ! మొగుళ్ళు పెళ్ళాలను కొట్టటంవల్ల తప్ప, విడాకులు లభించకపోయే పక్షంలో శ్రీరాములుగారికి పెళ్ళాన్ని కొట్టటానికి ఉన్న అర్హత ఎవరికి ఉందో చెప్పు! అటువంటి వాళ్ళందర్నీ నువ్వు సంస్కరించి నీ విడాకుల చట్టాన్ని ఎట్లా సదుపయోగం చేస్తావు?" అని వాణ్ణి చీవాట్లు పెట్టి ఇంటికి తీసుకువెళ్ళాను.

(ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి 1936, వినోదిని)